
సాక్షి బాపట్ల
శుక్రవారం ౹ 9 ౹ ఫిబ్రవరి ౹ 2024



రూ.1.20 లక్షల విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి ఆలయానికి టి.ఆంజనేయులు రూ.1.20లక్షల విరాళం అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 518.10 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 22,881 క్యూసెక్కులు విడుదల చేశారు.

అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా మల్లారెడ్డి



నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దేశిరెడ్డి మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నుంచి ఉత్తర్వులు అందాయి.

న్యూస్‌రీల్

ఆర్జేడీగా లింగేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకారం



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ గుంటూరు జోన్ ఆర్జేడీగా బి.లింగేశ్వరరెడ్డి గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్జేడీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారిగా ఉన్న లింగేశ్వరరెడ్డిని ప్రభుత్వం ఉద్యోగోన్నతిపై ఆర్జేడీగా నియమించింది. ఆయన స్వస్థలం నంద్యాల. 2008లో ఉప విద్యాశాఖాధికారిగా విధుల్లో చేరిన లింగేశ్వరరెడ్డి 2017లో ఉద్యోగోన్నతిపై వైజాగ్ డీఈఓగా వెళ్లారు. శ్రీకాకుళం, అనకాపల్లి, విజయనగరంలలో పని చేశారు.

రేపు 9,11 తరగతుల ప్రవేశానికి పరీక్ష

చిలకలూరిపేటటౌన్: మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ప్రవేశ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి శనివారం పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్, సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్, ఏఎంజీ హైస్కూల్, జవహర్ నవోదయ విద్యాలయలో ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ ప్రవేశ పరీక్ష కోసం 9వ తరగతి నుంచి 950 మంది, 11వ తరగతి కోసం 582 మంది దరఖాస్తు చేసుకున్నారని, విద్యార్థులు తమ హాల్‌టికెట్, ఆధార్ కార్డుతో పరీక్షలకు హాజరుకావాలని కోరారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరూ 11గంటలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఇప్పటికే అందరికీ హాల్‌టికెట్లు పంపామని, అందని వారు తమ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి

ఏపీఐఐసీ డైరెక్టర్ కాకుమాను




నరసరావుపేట: ఎంతో వెనుకబాటు తనానికి గురైన పల్నాడు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఐఐసీ) డైరెక్టర్ కాకుమాను సదాశివరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సదాశివరెడ్డిని ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీఓ జారీ చేసింది. దీనిపై సదాశివరెడ్డి గురువారం స్పందిస్తూ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తనను ప్రభు త్వం గుర్తించిందన్నారు. తన నియామకానికి కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్మాసిస్టు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరుమెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఫార్మసిస్టు గ్రేడ్–2 కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జి.శోభారాణి తెలిపారు. గుంటూరు జోన్ –3 పరిధిలో పది ఫార్మసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. విద్యార్హతలు దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం హెచ్‌టీపీఎస్//సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

యార్డుకు 1,41,193 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,41,193 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,35,466 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 22,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 93,415 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఆసరాతో బాసట

- వైఎస్సార్ సీపీ విజయంలో మహిళల పాత్రే కీలకం
- 40 ఏళ్ల చంద్రబాబు అనుభవం ఢిల్లీలో బీజేపీ ముందు మోకరిల్లింది
- రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున
- కొల్లూరులో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ



కొల్లూరులో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, బౌడ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, సమన్వయకర్త అశోక్‌బాబు

కొల్లూరు: మహిళలకు సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించడంతోపాటు, మహిళా సాధికారితకు దేశంలోనే పెద్దపీట వేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని.. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంలో మహిళల పాత్రే కీలకంగా మారనుందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గురువారం కొల్లూరులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ప్రాంతంలో నిర్వహించిన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను కష్టాల ఊబిలో వదిలేసి, ధనార్జనే ధ్యేయంగా అవినీతిలో మునిగితేలుతుంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టి ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకొని, అనంతరం ముఖ్యమంత్రిగా అనేక పథకాలు అమలు చేసి, వారి కన్నీళ్లు తుడిచారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజాపక్షపాత సీఎంగా ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. మహిళలకు వైఎస్సార్ ఆసరా రూపంలో రూ. 46 వేల కోట్లు రాష్ట్రవ్యాప్తంగా ఆర్థికసాయం అందజేయడంతోపాటు, రూ. లక్షల కోట్లు ఇతర సంక్షేమ పథకాల రూపంలో ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమచేస్తున్నారన్నారు. పేదల కష్టాలు, వారి ఆకలిని గమనించి సంక్షేమ పథకాల రూపంలో ఆదుకుంటున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, ఆయనకు మద్దతుగా నిలిచి తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే విధంగా మహిళలు తమ శక్తిని చాటి ప్రభంజనం సృష్టించాలని కోరారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి మేరుగ, మల్లిఖార్జునరావు, అశోక్‌బాబు

చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఒక్క పథకమూ లేదు..

14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు నాయుడికి ప్రజల కోసం ఏం చేశారో చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తూ సంక్షేమ పథకాల అమలుకే బ్రాండ్‌గా నిలిచారన్నారు. 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీ పెట్టలేని స్థితిలో ఉన్న చంద్రబాబునాయుడు ఓ సినీ నటుడిని అరువు తెచ్చుకుని తిరిగి ప్రజలను మోసగించాలని ప్రయత్నాలు చేస్తుంటే, ఆ సినీ నటుడు చంద్రబాబుకు అమ్ముడుపోయి ఆయన మీద నమ్మకం పెట్టుకున్న ఓ సామాజిక వర్గం మొత్తాన్ని నిలువునా మోసం చేస్తున్నాడని విమర్శించారు. 40 ఏళ్ల అనుభవం అని ప్రగల్భాలు పలికే చంద్రబాబు ఎన్నికల్లో ఒంటరిగా సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక నేడు ఢిల్లీ వెళ్లి బీజేపీ ముందు మోకరిల్లారన్నారు. వందల ఏళ్లుగా పరిష్కారం కాని రైతుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో తాను పరిష్కరించి ఎంతో మంది రైతుల పొలాలకు పట్టాలు అందజేశానన్నారు. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ, నియోజకవర్గంలో 5,169 డ్వాక్రా సంఘాలకు నాలుగోవిడత ఆసరా కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.189.38 కోట్లు రుణమాఫీ చేశారన్నారు. ఈసందర్భంగా మండలంలోని 1215 డ్వాక్రా సంఘాలకు రూ.13.08 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కును మంత్రి చేతులమీదుగా పంపిణీ చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలసి క్షీరాభిషేకం నిర్వహించారు. బౌడ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, వేమూరు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ ఉప్పు శిరీష, ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, కో– ఆప్షన్‌సభ్యుడు షేక్ బాజి, సొసైటీబ్యాంక్ చైర్మన్ సూర్యదేవర రామకృష్ణ, సర్పంచ్‌లు, డ్వామా పీడీ సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.



మహిళా గ్రూపులకు ఆసరా చెక్కు అందిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

మహిళలకు ఆర్థిక స్వావలంబన

- వైఎస్సార్ సీపీ పర్చూరు సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్
- 1027 మహిళా గ్రూపులకు రూ.9.71 కోట్ల చెక్కు పంపిణీ

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రంలో మహిళా సాధికారితకు, ఆర్థిక స్వావలంబనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. గురువారం ఇంకొల్లులో వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ లక్ష్మణాచారి అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారన్నారు. నియోజకవర్గ పరిధిలో ఈ ఐదేళ్లలో రూ.203 కోట్ల రుణమాఫీ జరిగిందని, నాలుగో విడతలో రూ.39 కోట్ల రుణమాఫీ జరగ్గా ఒక్క ఇంకొల్లు మండలంలో 1027 డ్వాక్రా గ్రుపులకు రూ 9.71 కోట్ల రుణ మాఫీ జరిగి మహిళలు లబ్ధి పొందారన్నారు.

సీఎం జగన్‌కు మనమంతా మద్దతివ్వాలి..

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉత్పాదకతకు సంబంధించి అన్ని వ్యవస్థలు నెలకొని ఉన్నాయని, వాటిని మహిళలు ఉపయోగించుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. మహిళలు భారీ పరిశ్రమలు నెలకొల్పే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలు వారి పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి కుటుంబాలను అక్షరాస్యత దిశగా మలచుకోవాలని, తద్వారా అభివృద్ధి సాధించాలన్నారు.

రాష్ట్రంలో మహిళా గ్రూపుల ద్వారా ఇటువంటి అవకాశాలను కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు అంతా అండగా ఉండాలన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కు పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలు ఆమంచికి శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి పూలమాలతో సత్కరించారు. ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ బండారు అనూష, పార్టీ మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఏపీఎం టి.మోహనరావు, వైస్ ఎంపీపీలు రావి రత్తమ్మ, తూమాటి చలమయ్య, గ్రామ సర్పంచ్ ప్రసన్న, ఎంపీటీసీ రావి పేరయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బండ్ల వెంకట సుబ్బారావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబుల్లా, షేక్ మస్తాన్‌వలి, వైస్ సర్పంచ్ సయ్యద్ లతీఫ్, సీనియర్ నాయకులు షేక్ ఉమ్రాన్‌అలి, షేక్ షంషుద్దీన్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత రామాంజమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

కన్నడ హీరో స్వచ్ఛంద ప్రచారం

- మహానేత వైఎస్సార్ ప్రోత్సాహంతో చిత్రసీమలోకి ప్రవేశించిన అద్దంకి బిడ్డ
- కన్నడంలో ఫైట్‌మాస్టర్, హీరోగా గుర్తింపు
- రోషాగ్నితో తెలుగులోనూ అరంగేట్రం
- ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రచారం



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డితో రాజావీరరాజు

అద్దంకి రూరల్: ఎందరో కళాకారులను అందించిన అద్దంకి నుంచి కన్నడ చిత్రసీమలో ఫైట్ మాస్టార్‌గా, హీరోగా కాలసూర్య రాజావీరరాజు రాణిస్తున్నారు. తాను పుట్టిన గడ్డకు సేవచేయాలన్న కోరికతో తనను ప్రోత్సహించి సినీ పరిశ్రమకు పంపిన దివంగత నేత వైఎస్సార్ రుణం తీర్చుకోవాలని నేడు అద్దంకిలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డికి మద్దతుగా గ్రామగ్రామాన తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తూ గెలుపునకు కృషి చేస్తున్నాడు.

అద్దంకి నుంచి కన్నడ చిత్రసీమలోకి...

అద్దంకి మండలంలోని చిన్న గ్రామమైన కొటికలపూడిలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన కాలసూర్య రాజా వీరరాజు చిన్నతనం నుంచి బలంగా ఎత్తుగా ఉండి చూపరులను ఇట్టే ఆకట్టుకునేవాడు. కరాటే మీద ఉన్న మక్కువతో ఒంగోలు, చీరాలలో కరాటే మాస్టర్‌ల వద్ద బేసిక్స్ నేర్చుకున్నాడు. అనంతరం మద్రాస్ వెళ్లి చైనాకు చెందిన వ్యక్తి వద్ద సంవత్సరంపాటు శిష్యుడిగా ఉండి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాడు. కడప జిల్లాకు వెళ్లి కరాటే స్కూల్ నడుపుతుండగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన ప్రోత్సాహంతో కన్నడ చిత్రసీమలోకి ప్రవేశించారు. వైఎస్సార్ ఇచ్చిన నైతిక, ఆర్థిక ప్రోత్సాహంతో రాజావీరరాజు కన్నడంలో మొదట గ్రూప్ ఫైటర్‌గా, షాడో ఫైట్‌మాస్టర్‌గా, ఫైట్‌మాస్టర్‌గా రాణిస్తూ రోషాగ్ని, అన్నం పరబ్రహ్మ స్వరూప, బీడల్లా కన్నడ చిత్రాల్లో హీరోగానూ నటించి మంచి హిట్‌లు పొందారు. కన్నడ చిత్ర రంగంలో మొదటగా హీరోగా నటించి సక్సెస్ సాధించిన రోషాగ్ని చిత్రాన్ని తెలుగులోనూ అనువదించి, అద్దంకిలో ఉచితంగా బెనిఫిట్ షోలు వేసి ప్రజల అభిమానం చూరగొన్నారు.

> **ముఖ్యమంత్రి జగనన్నను కలుస్తా...**
>
> దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ప్రోత్సాహంతో సినిమారంగంలోకి ప్రవేశించిన నేను ఆయన రుణం తీర్చుకోవటానికి అద్దంకిలో ప్రచారం చేస్తున్నాను. రాబోయే ఎన్నికల్లో జగనన్న గెలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఆయన్ను కలుస్తాను. అప్పటి వరకు వైఎస్సార్ సీపీ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తా.
>
> – సూర్యకాల రాజావీరరాజు

చిన హనిమిరెడ్డికి మద్దతుగా ..

దివంగత నేత వైఎస్సార్‌ను గురువుగా భావించే హీరో రాజావీరరాజు ఆ మహానేత రుణాన్ని తీర్చుకోవాలన్న సంకల్పంతో అద్దంకి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డికి మద్దతుగా గ్రామాలకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటివల్ల ప్రజలకు జరుగుతున్న మేలులు వివరిస్తూ ప్రచారం సాగిస్తున్నారు.

ఉత్సవాలకు వేళాయె...

పర్యాటక ప్రేమికుల మనసుల్ని కట్టిపడేసే ప్రకృతి సోయగాలు కొండవీడు సొంతం. ప్రకృతి విహార ప్రాంతాల సమాహారం. సహజ అందాలతో అలరారే కొండవీడు సరికొత్త అందాలకు నెలవుగా మారింది. పట్టణ, నగర వాసులు వారాంతంలో ఆనందంగా గడిపే అనువైన స్థలంగా రూపుదిద్దుకుంది.

- గిరిదుర్గం రాష్ట్రానికే తలమానికం.. ఆంధ్ర గోల్కొండగా సార్థకం
- మరోమారు కొండవీడుకోటలో ఉత్సవాలు
- రేపటి నుంచి రెండు రోజులపాటు కొండవీడు ఫెస్ట్–2024



అందంగా రూపుదిద్దిన కొండవీడు స్వాగత ద్వారం


యడ్లపాడు: కొండవీడును పర్యాటక కేంద్రంగా రూపొందించాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో రూ.5 కోట్ల నిధులిచ్చి శ్రీకారం చుట్టగా..ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండవీడు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు ఇవ్వడం జరుగుతుంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కలలు ఒక్కొక్కటిగా సాకారం అవుతున్నాయి. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ గిరిదుర్గంపై మరోమారు ఉత్సవాలు జరగనున్నాయి. కొండవీటి ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు, సామంతులు, చక్రవర్తులు శతాబ్ద కాలానికిపైగా ఏలిన అద్దంకి రెడ్డిరాజులు, అన్నింటికి మించి తెలుగువారి పాలనా వైభవాలను భావితరాలకు చూపడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యంగా శని, ఆదివారాలలో కొండవీడు ఫెస్ట్–2024 నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శ్రీకారం చుట్టారు.

ఉత్సవాల ప్రత్యేకం

రెండు పారా మోటరింగ్, ఒక హెలీరైడ్, హాట్ ఎయిర్ బెలూన్, రాక్ క్లైంబింగ్, చారిత్రక ఛాయాచిత్ర, సైకత శిల్ప ప్రదర్శన, ఫ్లవర్‌షో, ఫుడ్ ఫెస్ట్, చిల్డ్రన్స్ ఎగ్జిబిషన్, క్లాసికల్, వెస్ట్రన్ డాన్స్ పోటీలను ఏర్పాటు చేశారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నగరవనం పేరిటా ఏటా ఇస్తున్న నిధులతో నైట్ క్యాంపు గుడారాలు, చీకటి భయం లేకుండా విద్యుద్దీపాలు, నిఘా నేత్రాలు కలిగిన కెమెరాలు, ఒంపైన ఘాట్ రోడ్లు, తడపడకుండా అడుగడుగున సూచికలు, ప్రతి కట్టడం వద్ద దాని చరిత విశిష్టత తెలిపే బోర్డులు, సెల్ఫీలకు చెరువులో డెక్‌లు, ఆటలాడేందుకు చిల్డ్రన్స్ పార్కు. శత్రుదుర్భేద్య చరితను తెలిపే థీమ్‌పార్కు, యువత అమితంగా ఇష్టపడే సాహస క్రీడలు, ఏటవాలు కొండలు, లోయల్ని చూపే వ్యూపాయింట్స్. స్వాగత ద్వారం, సేదదీరేందుకు షెల్టర్స్, భోజనాశాలలు, తాగునీరు, కొండపై హార్స్ రైడింగ్ ఏర్పాటు చేశారు.



కొండవీడు గిరిదుర్గం

హెలికాప్టర్ రైడ్‌లో పిల్లలకు రాయితీ

నరసరావుపేట: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొండవీడు ఫెస్ట్–2024లో హెలికాప్టర్ రైడ్‌కు సంబంధించి 12 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశ రుసుంలో రాయితీ ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం వెల్లడించారు. పిల్లలకు టికెట్ ధర రూ.4వేలుగా నిర్ణయించామని తెలిపారు. స్కూలు పిల్లలు బస్సులు లేదా గ్రూపుగా వచ్చే వారికి ప్రవేశ రుసుం ఉండదని తెలిపారు.

చేరువ చేయడమే లక్ష్యం



> సందర్శకులకు అంతులేని ఆనందం..మధుర జ్ఞాపకంగా మిగిలిపోయేలా కొండవీడు ఫెస్ట్‌ను రూపొందిస్తున్నాం. వినోద విందులు, సహ పంక్తులు, సంస్కృతి, వారసత్వ సంపద, చరిత్ర ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించనున్నాం. వీటికితోడు సరదా ఆటలు, సాహస క్రీడలు, సాంస్కృతిక పోటీలతో పిల్లలు, పెద్దలు, కుటుంబ సభ్యులందరూ హాయిగా గడిపేలా రంగం సిద్ధం చేస్తున్నాం. తెలుగువారి ఘన చరిత్రను ప్రతిఒక్కరికీ మరింత చేరువ చేయడమే ఉత్సవాల ముఖ్యోద్దేశం.
>
> –శివశంకర్ లోతేటి, కలెక్టర్, పల్నాడు జిల్లా

నిత్యం కొత్తదనమే



> సందర్శకులకు కావాల్సిన అన్ని వసతుల్ని ఏర్పాటు చేస్తున్నాం. నిరంతరాయంగా జరిగే అభివృద్ధితో కొండవీడు నిత్యం సరికొత్తగానే దర్శన మిస్తోంది.
>
> –ఎస్ రామచంద్రరావు, డీఎఫ్‌వో, పల్నాడు జిల్లా

బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ నాగూర్‌వలి

మార్టూరు: జాతీయ రహదారిపై కారు బైకును ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన బొల్లాపల్లి సాగర్ కాలువ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌వలి (26), షేక్ నజీర్, హరీష్ అనే ముగ్గురు యువకులు బొల్లాపల్లి టోల్‌గేట్ దగ్గర నుంచి ద్విచక్ర వాహనంపై మార్టూరు వెళ్తున్నారు. బొల్లాపల్లి సాగర్ కాలువ సమీపంలో రహదారిపై వీరి బైకును అదేమార్గంలో విజయవాడ వైపు వెళ్తున్న ఓ కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు రోడ్డుపై పడి తలకు గాయమై తీవ్ర రక్తస్రావంతో నాగూర్ వలి అక్కడికక్కడే మృతి చెందాడు. తేలికపాటి గాయాలతో బయటపడిన నజీర్, హరీష్‌లను 108 వాహనంలో మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చిలుకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన ఎస్.జయన్నారాయణ, ప్రకాశం జిల్లా కొండపి మండలం పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కె.శివరామయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రహదారిపై అడ్డంగా అన్న వాహనాలను హైవే సిబ్బంది అడ్డు తొలగించి ట్రాఫిక్ సమస్యను తొలగించారు.

వెట్టిచాకిరి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

సీఐడీ అడిషనల్ డీజీపీ ఎన్.సంజయ్



ఏఎన్‌యూ: వెట్టిచాకిరి (బాండెడ్ లేబర్) రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని చేసిన సంకల్పం ఫలప్రదంగా ఉందని ఆంధ్రప్రదేశ్ సీఐడీ అడిషనల్ డీజీపీ ఎన్.సంజయ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గురువారం 'బాండెడ్ లేబర్ డే, ఆపరేషన్ స్వేచ్ఛ డే మొదటి వార్షికోత్సవం'లో డీజీపీ ప్రసంగిస్తూ ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం 2023 ఫిబ్రవరి 9వ తేదీన ప్రారంభమయ్యిందన్నారు. సీఐడీ, లేబర్ డిపార్ట్‌మెంట్, సీడబ్ల్యూసీ, డీఎల్‌ఎస్‌ఏ తదితర విభాగాల సమన్వయంతో అనుకున్న లక్ష్యాలు సాధించగలిగామన్నారు. 2023వ సంవత్సరంలో నాలుగు విడతల్లో దాడులు నిర్వహించామని ఫలితంగా 1506 మంది బాల కార్మికులకు స్వేచ్ఛ కల్పించామని తెలిపారు. వారిలో 897 మంది పిల్లలను రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విజయవంతంగా చేర్పించామని తెలిపారు. కార్మిక, పోలీసు శాఖల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీజీపీ సంజయ్‌తోపాటు, సీఐడీ ఉమెన్ ప్రొటక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ, కార్మిక శాఖ జోన్–2 జాయింట్ కమిషనర్ ఎ.రాణి, పశ్చిమగోదావరి కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, ఇంటర్నేషన్ జస్టిస్ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ క్లైమెంట్ పలు అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని యువకుడు మృతి



వేమూరు: లారీ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా పేర్నమిట్ట, పీర్లమాన్యంకు చెందిన షేక్ రాహుల్ (23) వేమూరు నుంచి తెనాలికి గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈక్రమంలో తెనాలి నుంచి కొల్లూరుకు వేగంగా వెళుతున్న లారీ జంపని సినిమా హాల్ వద్ద రాహుల్ బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో తీవ్రగాయాలపాలైన రాహుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని వేమూరు ఎస్‌ఐ ఎస్. రాజశేఖర్ తెలిపారు. లారీని వేమూరు పోలీసు స్టేషనుకు తరలించామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు నుంచి జారిపడి ..



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మరణించిన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో గురువారం జరిగింది. సంగం జాగర్లమూడి రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 28 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూ నైట్ ఫ్యాంట్, లైట్ గ్రీన్ ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి రన్నింగ్ ట్రైన్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ సంగం జాగర్లమూడి స్టేషన్ సమీప ప్రాంతంలో జారిపడటంతో తీవ్ర గాయాలై మరణించినట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గుంటూరు రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు.

నిరుద్యోగులకు వృత్తి విద్యా శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: గ్రామీణ యువతి యువకులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారి ఉన్నతికి కృషి విజ్ఞాన కేంద్రాలు కృషి చేస్తున్నాయని లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం అగ్రానమీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిరుద్యోగ గ్రామీణ యువతి యువకులకు విలువ ఆధారిత వానపాముల ఎరువుల తయారీపై ఆరు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించే శిక్షణ తరగతులకు ఆసక్తిగల అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు 9490035258, 9489051559 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడాకారులు విజయాలతో రావాలి

గుంటూరు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి



రాష్ట్ర పోటీలకు వెళ్తున్న క్రీడాకారులతో జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరచి ప్రథమ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లోనూ సత్తా చాటాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం నుంచి విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర పోటీలకు వెళ్లే జిల్లా క్రీడాకారుల బృందం బస్సుకు జేసీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 114 మంది పురుషులు, మహిళలు రాష్ట్ర పోటీలకు వెళుతున్నారన్నారు. అన్ని క్రీడలకు కిట్స్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వమే అందించి గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను నగదు బహుమతులతో ప్రోత్సహించిందన్నారు. సమావేశంలో డీఎస్‌ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, క్రీడా కోచ్‌లు పాల్గొన్నారు.

దాల్ మిల్ క్లస్టర్ల ఏర్పాటుకు భూములిస్తాం


గుంటూరు వెస్ట్: తెనాలి ప్రాంతంలో దాల్ మిల్ క్లస్టర్ల ఏర్పాటుకు అవసరమైన భూములను త్వరలోనే అందిస్తామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ భూ సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామనీ, త్వరలోనే పరిశ్రమల శాఖకు భూములు అందజేస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రేషన్ పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా ప్రజలకు ఉపయోగకరంగా నిర్వహించాలని జేసీ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ తూనికలతోపాటు, రేషన్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. పంపిణీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన లాగా ప్రజల ముంగిటికే రేషన్ అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి ప్రజల సౌలభ్యం కోసం అనేక నూతన ప్రక్రియలు అమలులోకి తెచ్చిందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద వారి ఆకలిని తీర్చే రేషన్ పంపిణీని సామాజిక బాధ్యతలో భాగంగా చూడాలన్నారు. రేషన్ పంపిణీ ప్రక్రియలో ఇబ్బందులుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో డీఎస్‌ఓ కోమలి పద్మ పాల్గొన్నారు.

ఊసరవెల్లి రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



మార్టూరు: చంద్రబాబు తన ఊసరవెల్లి రాజకీయాలతో తన అవకాశవాద పొత్తులతో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మార్కెటింగ్, కో-ఆపరేటివ్ సొసైటీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. గురువారం మార్టూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేనలు కలిసినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టలేమనే అభద్రతా భావంతోనే చంద్రబాబు బీజేపీతో సైతం పొత్తుకు తెరతీశారని ఆయన పేర్కొన్నారు. 1999లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు 2004లో పొత్తును విరమించుకుని మళ్లీ 2014లో బీజేపీతో జతకట్టి 2019లో తీవ్రంగా విమర్శించి దూరమైన విషయాన్ని ఆయన మరచిపోయినా.. ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వస్తే మోదీని అరెస్టు చేస్తానని నాడు పలికిన చంద్రబాబు నేడు బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడడంలోని మర్మమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. తన అవకాశవాద రాజకీయాలతో రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించిన చంద్రబాబు ఎప్పుడు ఏం మాట్లాడుతారో తనకే స్పష్టత లేని జనసేన నేత పవన్ కల్యాణ్‌లను ప్రజలు విశ్వసించడం లేదు కాబట్టే మరో కొత్త పొత్తుకు నాయకులిద్దరూ తాపత్రయ పడుతున్నారన్నారు. నవరత్నాల పథకాల పేరిట సీఎం జగన్ గత 5 సంవత్సరాల కాలంలో సుమారు రూ.3 లక్షల కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేస్తే అందులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదనే వాస్తవాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కాదనగలరా అని ప్రశ్నించారు.

పశు యాజమాన్యంపై అవగాహన అవసరం

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు



లేగదూడల యజమానులకు బహుమతులు అందజేస్తున్న హనుమంతరావు, నిర్వాహకులు

రేపల్లె రూరల్: పశురక్షణ యాజమాన్య పద్ధతులపై పశుపోషకులకు సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎం.హనుమంతరావు అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పేటేరు పంచాయతీ సమీపంలో గురువారం మండలంలోని లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూగజీవాలైన పశువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నిరంతరం పశువైద్యులను సంప్రదిస్తూ పశువులకు అవసరమైన సదుపాయాలు సమకూర్చాలన్నారు. ఏ మాత్రం అనారోగ్యం కనిపించినా పశువైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలన్నారు. సకాలంలో వ్యాక్సిన్‌లు, గాలికుంటు వ్యాధి టీకాలు, నట్టల నివారణ మందులు అందించాలని చెప్పారు. పశు బీమా పథకాలు, దూడలను పెంచే విధానాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో డొక్కు రామాంజనేయులు, శొంఠి రామకృష్ణ, విన్నకోట ప్రభాకర్‌ల లేగదూడలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించాయి. లేగదూడల యజమానులకు బహుమతులు అందజేశారు. పశుసంవర్ధకశాఖ తెనాలి డిప్యూటీ డైరెక్టర్ వై.కేదారేశ్వర్, రేపల్లె మండల పశువైద్యులు మీనాక్షిదేవి, ప్రవీణ్‌కుమార్, నగరం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు, పశువైద్యులు రోషన్‌బేగ్, హేమప్రియ, లక్ష్మీరంజిత తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడలో భూమి పాత్ర కీలకం

వీసీ ఆచార్య పి. రాజశేఖర్



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: మానవ మనుగడలో భూమి పాత్ర కీలకమని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. భూమికి, మానవులకు విడదీయరాని బంధం నెలకొందని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారతదేశ వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతికత సవాళ్లు, వ్యూహాలు - ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సూచన' అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సును గురువారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ వ్యవసాయ రంగంలో నెలకొన్న అస్థిరత్వం వల్ల శ్రామికశక్తి శాతం అల్పంగా ఉందని తెలిపారు. వాతావరణం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాలపై సమాచారాన్ని రైతులకు అందజేయడంలో ఐసీటీ కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ముంబై టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్, స్కూల్ ఆఫ్ డెవలప్‌మెంటు స్టడీస్, సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ అబ్దుల్ షబాన్ కీలకోపన్యాసం చేశారు. దేశంలో ఆర్థిక, సాంఘిక వైవిధ్యంతోనే అన్ని రంగాల్లో వృద్ధి సాధ్యం అవుతుందని చెప్పారు. ఆహార ఉత్పత్తుల పెంపుదలతో ఆకలి చావుల్ని అరికట్టి, పౌష్టికాహారం అందించవచ్చని చెప్పారు. ఆర్థిక స్వాతంత్య్రం లేనిదే సామాజిక స్వాతంత్య్రం రాదని తెలిపారు. డైరెక్టర్ ఆచార్య మధుబాబు సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, సోషల్ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు ప్రసంగించారు. సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలు యూనివర్సిటీల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో పల్నాడు ఖ్యాతిని ఇనుమడింపజేయాలి



నరసరావుపేట: క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి పల్నాడు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్రా నోడల్ అధికారి ఏ. శ్యాంప్రసాద్ ఆకాంక్షించారు. విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడలలో జిల్లా నుంచి పాల్గొనే 10 జట్ల క్రీడాకారులను గురువారం అభినందించారు. డీఎస్‌ఏ స్టేడియం నుంచి క్రీడాకారులను విశాఖపట్నం తీసుకువెళ్లే బస్సులకు ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం ఐదు క్రీడా విభాగాల్లో పాల్గొనేందుకు పది జట్లను వైజాగ్ పంపినట్లు ఆయన చెప్పారు. వాలీబాల్ కోచ్ శ్రీనివాస్ యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

లేగదూడల పోషణపై అవగాహన పెంచుకోండి

- పశుసంవర్థక శాఖ డీడీ రామారావు
- కోనూరులో లేగదూడల అందాల పోటీలు

అచ్చంపేట: నేటి లేగ దూడలే రేపటి పాడి గేదెలని, లేగదూడలను యాజమాన్య పద్ధతుల ద్వారా పెంచుకోవాలని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు అన్నారు. మండలంలోని కోనూరులో గురువారం జరిగిన లేగ దూడాల అందాల పోటీలలో వివిధ గ్రామాల నుంచి 57 దూడలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి డాక్టర్ పి.రామారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పశు పోషకులు తమ పశువులను పశుసంవర్ధక శాఖ సూచనలను పాటిస్తూ పెంచుకున్నట్లయితే ఆరోగ్యవంతమైన దూడలతో పాటు, అధిక పాల దిగుబడిని పొందవచ్చని చెప్పారు. పశు పోషకులు పాటించవలసిన యాజమాన్య పద్ధతులను అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నరసింహులు వివరించారు. లేగ దూడల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన దాసరి సాలగ్రాం, మచ్చా మార్కండేయులు, గుంటుపల్లి ఆంజనేయులకు 5 లీటర్లు, 3 లీటర్లు, 2 లీటర్ల పాల క్యానులను బహుమతులుగా అందజేశారు. న్యాయ నిర్ణేతగా పెదకూరపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.శివసారథిబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో అచ్చంపేట, వేల్పూరు పశు వైద్యాధికారులు డాక్టర్ స్వాతీదేవి, వీఎల్‌ఓ సువర్ణకుమారి, రామారావు, కోనూరు గ్రామ పశు పోషకులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన బయో ఉత్పత్తుల గుర్తింపు

రూ.6.10 లక్షల విలువ చేసే సరుకు విక్రయాలు నిలుపుదల



నిల్వ చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

నగరంపాలెం: అనుమతులు లేకుండా నిల్వ చేసిన బయో ఉత్పత్తుల విక్రయాలను గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిలుపుదల చేశారు. ఆ విభాగ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం ఏటుకూరు రోడ్డులోని కమ్మ శేషయ్య గ్రౌండ్‌లో ఎం.ఎస్. కేదార్ అగ్రోస్ ప్రైవేట్ లిమిటెడ్ గోడౌన్‌లో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంజూరు చేసే జీ2 అనుమతుల్లేకుండా, అక్రమంగా బయోస్టిమ్‌లెంట్స్ నిల్వ చేసినట్లు గుర్తించారు. రూ.6.10 లక్షల విలువ చేసే 350 లీటర్ల బయోస్టిమ్‌లెంట్స్ ఉత్పత్తుల విక్రయాలను నిలుపుదల చేసి నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి కె.రమణకుమార్, ఎస్‌ఐ ఎం.రామచంద్రయ్య, స్థానిక ఏఓ బి.కిశోర్ పాల్గొన్నారు.

డీఎం న్యూరాలజీలో డాక్టర్ అపర్ణ స్వాతికి స్వర్ణ పతకం

స్నాతకోత్సవంలో బహూకరించిన రాష్ట్ర గవర్నర్



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి స్వర్ణ పతకం స్వీకరిస్తున్న అపర్ణ స్వాతి

తెనాలి: పట్టణానికి చెందిన డాక్టర్ అపర్ణ స్వాతి కిలాని డీఎం న్యూరాలజీలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో ప్రథమ స్థానం సాధించారు. విజయవాడలో ఈనెల 6న జరిగిన విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా స్వర్ణపతకం స్వీకరించారు. స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎనికేపల్లి అంబరీషుడు-సతీసుమతి కోడలు అపర్ణ స్వాతి. ఆమె భర్త డాక్టర్ ఎనికేపల్లి అనిల్‌కుమార్. 2017లో వీరి వివాహమైంది. అంతకుముందు కాటూరి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేసిన అపర్ణ స్వాతి, నారాయణ మెడికల్ కాలేజీ, నెల్లూరులో ఎండీ చేశారు. విశాఖపట్టణంలోని కేజీహెచ్‌లో డీఎం న్యూరాలజీ చేశారు. ఆ విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి విశ్వవిద్యాలయంలో ప్రథమంగా వచ్చారు. అపర్ణ స్వాతి తండ్రి శ్రీనివాసరావు విశ్రాంత రైల్వే అధికారి కాగా, తల్లి విజయకుమారి ఉపాధ్యాయిని. అపర్ణ స్వాతి భర్త అనిల్‌కుమార్‌తో కలిసి గుంటూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. తెనాలిలో కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన పెదకాకాని శివాలయం డీసీ

పెదకాకాని: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా డి శ్రీరామ వరప్రసాదరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖలో డీసీ క్యాడర్‌కు జరిగిన ప్రమోషన్లు, బదిలీల్లో భాగంగా పెదకాకాని దేవస్థానానికి శ్రీరామ వరప్రసాదరావును నియమించారు. ప్రస్తుత ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి నుంచి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గ సభ్యులతో కలిసి మరింత సౌకర్యవంతమైన వసతులు, ఏర్పాట్లకు తగు చర్యలు తీసుకుంటామని నూతన డీసీ వివరించారు. ప్రభుత్వం, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.

రుణ గ్రహీతలను వేధిస్తే కఠిన చర్యలు

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పిల్లి యజ్ఞనారాయణ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట రామయ్యను పరామర్శిస్తున్న విజిలెన్స్ కమిటీ సభ్యులు

నాదెండ్ల: ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల రికవరీ సిబ్బంది ఆర్బీఐ నిబంధనలకు లోబడి వసూళ్లు చేయాలని, లేకుంటే వ్యక్తిగత కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పిల్లి యజ్ఞనారాయణ హెచ్చరించారు. గణపవరం గ్రామానికి చెందిన టైలర్ వింజమూరి వెంకటరామయ్యను ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సిబ్బంది రుణ వసూలు విషయంలో బెదిరించి దౌర్జన్యం చేయటంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన విధితమే. బాధితుడు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆరోగ్యం విషమంగా ఉంది. విజిలెన్స్ కమిటీ సభ్యుడు యజ్ఞనారాయణ గురువారం ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికవరీ పేరుతో వివిధ సంస్థల ఏజెంట్లు రుణ గ్రహీతలపై వ్యక్తిగత దూషణలు, దాడులకు పాల్పడుతున్నారన్నారు. వారి ఇళ్లలోని వస్తువులను హ్యాండోవర్ చేసుకోవటంతో పాటు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఈ తరహా దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయనతో పాటు పల్నాడు జిల్లా కన్స్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మురికిపూడి ప్రసాద్, రవినాయక్, బాబివిక్రమ్ తదితరులు ఉన్నారు.

యడ్లపాడుకు ఇస్రో శాస్త్రవేత్తల రాక

- జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు హాజరు
- విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు బస్సుయాత్ర



వివరాలు వెల్లడిస్తున్న జేవీవీ ప్రతినిధులు

యడ్లపాడు: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు యడ్లపాడుకు రానున్నారు. రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు ఈ నెల 10,11వ తేదీల్లో నిర్వహించనున్నారు. యడ్లపాడు గ్రామంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రారంభం కానున్న తొలిరోజు పోటీలకు శాస్త్రవేత్తలు పాల్గొననున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, పల్నాడు జిల్లా కార్యదర్శి దార్ల బుజ్జిబాబు తెలిపారు. అనంతరం జన విజ్ఞాన కళాయాత్ర కార్యక్రమంలో భాగంగా చారిత్రక ప్రాధాన్యత కలిగిన కొండవీడుకోటను సందర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో శాస్త్రవేత్తలతో పాటు పోటీల్లో పాల్గొనే విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. సాయంత్రం చిలకలూరిపేట పట్టణంలోని సాధినేని చౌదరయ్య స్కూల్ ఆవరణలో ఇస్రో వారి బస్సు విజ్ఞాన యాత్ర కొనసాగుతుందన్నారు. కేవలం పోటీలకు వచ్చే విద్యార్థులే కాకుండా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం పాల్గొనవచ్చని తెలిపారు. విజ్ఞాన యాత్ర పూర్తిగా ఉచితమని వివరాలకు 92905 04570, 73829 73474 నంబర్లకు సంప్రదించాలన్నారు.